క్లుప్తంగా

కేంద్రీయ విద్యాలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు



నిజామాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో మంగళవారం బోయిన్‌పల్లి క్లస్టర్ స్థాయి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ యూనివర్సిటీ ప్రిన్సిపల్ ప్రవీణ్, కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల మధ్య పోటీతత్వం ఏర్పడుతుందన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులు కేంద్రీయ విద్యాలయం హైదరాబాద్ విభాగం స్థాయి పోటీల్లో పాల్గొన డానికి అర్హత సాధిస్తారని ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 9 కేంద్రీయ విద్యాలయాల విద్యార్థులు పాల్గొని, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. జ్ఞాన సరస్వతి సంగీత కళాశాల ప్రిన్సిపల్ రవీంద్ర రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రచయిత్రి రజిత మరణం తీరని లోటు

నిజామాబాద్ రూరల్: ప్రముఖ రచయిత్రి, ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ అధ్యక్షురాలు అనిసెట్టి రజిత మరణం సాహితీ లోకానికి తీరని లోటు అని తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామిడి సతీశ్‌రెడ్డి, ఉపాధ్యక్షులు బానోత్ ప్రేమ్‌లాల్ పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకాలంలో తెలంగాణ రచయితల వేదిక నిర్మాణంలో చురుకైన పాత్ర పోషించిందని అన్నారు.

సీతారాం ఏచూరి ఆశయాలు కొనసాగిస్తాం



నిజామాబాద్ సిటీ: సీపీఎం పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆశయాలను కొనసాగిస్తామని, ఆయన చూపిన బాటలో పయనిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్ బాబు అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని నాందేవ్‌వాడలోని పార్టీ కార్యాలయంలో ఏచూరి జయంతి నిర్వహించారు. దేశంలో కార్మికవర్గ రాజ్యం ఏర్పాటే లక్ష్యంగా తన జీవితాంతం కృషిచేశారన్నారు. నాయకులు బెజు గం సుజాత, విఘ్నేశ్, నర్సయ్య, దీపిక, ఈవీఎల్ నారాయణ, ఉద్ధవ్, రాజు పాల్గొన్నారు.

కొత్త స్వయం సంఘాల ఏర్పాటుపై శిక్షణ



మోపాల్: మండలకేంద్రంలోని ఆదర్శ మండల సమాఖ్య కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు కొత్త స్వయం సహాయక సంఘాల ఏర్పాటుపై ఏపీఎం సరోజిని మంగళవారం ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ.. ఇందిరా మహిళాశక్తి కార్యక్రమంలోభాగంగా మహిళలందరినీ కొత్త, ఇప్పటికే ఉన్న స్వయం సహాయక సంఘాల్లో చేర్పించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలని, బీఎల్ఎస్ఎన్ ద్వారా లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీసీలు, ఎంఎస్ సిబ్బంది, వీవోఏలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

నిజామాబాద్‌అర్బన్: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని టీఎన్జీవో అధ్యక్షుడు సుమన్ గురువారం జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. గత కొన్ని నెలలుగా అంగన్‌వాడీలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో టీఎన్జీవో కార్యవర్గ బృందం, అంగన్‌వాడీలు ఉన్నారు.

మూలమలుపుల వద్ద జాగ్రత్తగా ప్రయాణించాలి

నిజామాబాద్ రూరల్: మూలమలుపుల వద్ద ప్రయాణికులు జాగ్రత్తగా ప్రయాణించాలని రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరిఫ్ అన్నారు. మంగళవారం మల్లారం గండిలో మూలమలుపుల వద్ద ఉన్న ముళ్లపొదలను జేసీబీ సహాయంతో శుభ్రం చేయించారు. రూరల్ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

నిజామాబాద్ అర్బన్: నగరంలోని బాలికల ఐటీఐలో ఈ నెల 14న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణులైన యువతులకు ఉపాధి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. జాబ్‌మేళాలో ప్రైవేటు కంపెనీలు పాల్గొంటాయని, 18 నుంచి 25 సంవత్సరాల లోపు వారు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు 9441707536 నెంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాల అమలులో మోపాల్ భేష్

- ట్రెయినీ కలెక్టర్ కరోలినా చింగ్తియాన్ మావీ
- మోపాల్, తాడెంలో పర్యటన

మోపాల్ : ప్రభుత్వ పథకాల అమలులో మోపాల్ భేషుగ్గా ఉందని ట్రెయినీ కలెక్టర్ కరోలినా చింగ్తియాన్ మావీ అన్నారు. మోపాల్ మండలంలోని మోపాల్, తాడెం గ్రామాల్లో ట్రెయినీ కలెక్టర్ మంగళవారం పర్యటించారు. మోపాల్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. రైతు వేదిక వద్ద నిర్వహించిన వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం తాడెంలో నర్సరీని పరిశీలించారు. రేషన్‌షాప్ డీలర్ వద్ద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, రేషన్‌కార్డుదారులతో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. ట్రెయినీ కలెక్టర్ వెంట ఎంపీడీవో రాములు నాయక్, ఎంపీవో కిరణ్‌కుమార్, ఏపీవో సునీత, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.



మోపాల్‌లో పనులు పరిశీలిస్తున్న ట్రెయినీ కలెక్టర్

బీజేపీలో పలువురి చేరిక

మోపాల్ : కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ ఉమ్మడి మండల సీనియర్ నాయకుడు బోడ మహేందర్ మంగళవారం ఎంపీ అర్వింద్ ధర్మపురి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి సమక్షంలో కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరారు. ఆయనకు ఎంపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీలోనే రాజకీయ ఓనమాలు నేర్చుకున్న మహేందర్.. రాజకీయ పరిస్థితులకనుగుణంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల్లో క్రియాశీలకంగా పనిచేశారు. దేశం సురక్షితంగా ఉండాలంటే కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని మహేందర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శశాంక్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ పద్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బోడ మహేందర్‌కు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ అర్వింద్ ధర్మపురి

బీజేపీ ఆధ్వర్యంలో మహాయాత్ర



సిరికొండ: మండలంలోని పెద్దవాల్గోట్‌లో బీజేపీ ఆధ్వర్యంలో మహాయాత్ర కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. యాత్రలో భాగంగా నాయకులు గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేందర్, గంగారెడ్డి, రంజిత్ రెడ్డి, గోవింద్, కార్తీక్, ఆదర్శ్, ప్రమోద్, అరుణ్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ పై యూట్యూబ్ షార్ట్ ఫిల్మ్ ప్రదర్శన



ప్రసాద్‌ను సన్మానిస్తున్న నార్కోటిక్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, పోలీస్ అధికారులు

ఖలీల్‌వాడి: హైదరాబాద్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రెయిన్ ది ట్రెయినర్‌వర్క్ షాప్‌లో నిజామాబాద్ నగరానికి చెందిన ఎల్ఎస్ఎస్ ప్రసాద్ తీసిన యూట్యూబ్ షార్ట్ ఫిల్మ్‌ను మంగళవారం ప్రదర్శించారు. సమాజంలో యువతకు ఎంతో ఉపయోగపడే చక్కటి షార్ట్ ఫిల్మ్ తీసిన ప్రసాద్‌కు, సహకరించిన లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ యాంటీ డ్రగ్ అవెర్నెస్ డిస్ట్రిక్ట్ చైర్మన్ విజయానంద్‌కు నార్కోటిక్స్ డైరెక్టర్ అభినందనలు తెలిపారు.

కార్యక్రమంలో నార్కోటిక్స్ ఎస్పీ సీతారాం, ఏఎస్పీ కృష్ణమూర్తి, సీఐ శ్రీనివాస్‌రావు, లయన్స్ డిస్ట్రిక్ట్–హెచ్ గవర్నర్ గంప నాగేశ్వర రావు, ఇంపాక్ట్, పాలిటెక్నిక్ బోధన సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను నిరోధించాలి



సిరికొండ : గంజాయి డ్రగ్స్, గుట్కాలాంటి మత్తు పదార్థాలను నిరోధించాలని ప్రగతిశీల యువజన సంఘం పీవైఎల్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఆశిష్ ఎస్సైరామకృష్ణను కోరారు. పీవైఎల్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మత్తు పదార్థాలను నిరోధించాలని పార్టీ నాయకులతో కలిసి ఎస్సైకి మంగళవారం వినతిపత్రం అందజేశారు. నాయకులు అక్షయ్, ప్రణీత్, పండరి, నరేశ్, సుమన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

చెత్త నుంచి ఎరువులు తయారు చేయాలి

- డీపీవో శ్రీనివాస్‌రావు

డిచ్‌పల్లి: చెత్త నుంచి ఎరువులను తయారు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) శ్రీనివాస్‌రావు సూచించారు. మంగళవారం డిచ్‌పల్లి మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ నడిపల్లి, రాంపూర్ గ్రామ పంచాయతీని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డీపీవో వెంట ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శులు గంగాదర్, రాకేశ్, సిబ్బంది ఉన్నారు.



నడిపల్లి డంపింగ్‌యార్డు ను పరిశీలిస్తున్న డీపీవో

సర్వీస్ రోడ్లు నిర్మించాలి



ఇందల్వాయి: జాతీయ రహదారి పక్కన ఉన్న దేవీ తండా, ఎత్తుతండా, రూప్లనాయక్ తండాలకు వెళ్లేందుకు వీలుగా సర్వీస్ రోడ్లను నిర్మించాలని జాతీయ రహదారుల పీడీ శ్రీనివాస్‌కు స్థానిక గిరిజన నాయకులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. అనువైన సర్వీస్ రోడ్లు లేక గిరిజనులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. సానుకూలంగా స్పందించిన పీడీ సంబంధిత అధికారులతో సర్వే చేయించి సర్వీస్ రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మాజీ ఎంపీపీ రమేశ్ నాయక్, సదర్ నాయక్ రాజు నాయక్, ఆలయ పూజారి శివరాం మహరాజ్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి యోగాలో జిల్లా చాంపియన్‌షిప్

నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిల్లా చాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. హైదరాబాద్‌లో ఈనెల 7, 8వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర సీనియర్, సీనియర్ ఏ, బీ, సీ విభాగాల్లో జిల్లా యోగాసన క్రీడాకారులు పాల్గొని అద్భుతమైన ప్రదర్శనతో చాంపియన్ షిప్ కైవసం చేసుకున్నారు. జిల్లా నుంచి 12 మంది యోగా క్రీడాకారులు పోటీల్లో పాల్గొని 24 పతకాలు గెలుచుకున్నారు. విజేతలైన క్రీడాకారులు సెప్టెంబర్ 9 నుంచి 14 వరకు ఛత్తీస్‌గఢ్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. అనంతరం జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యోగరత్న ఎక్కొండ ప్రభాకర్, గౌరవ అధ్యక్షుడు బి. రామచందర్, జిల్లా కార్యదర్శి టి.బాల శేఖర్, కార్యనిర్వాహణ కార్యదర్శి జి. సంగీత, ఎం భూమాగౌడ్, రఘువీర్, జ్యోతి అభినందించారు.



పోటీల్లో విజేతగా నిలిచిన క్రీడాకారులు

వడ్ల కమీషన్ వెంటనే విడుదల చేయాలి

డిచ్‌పల్లి: సొసైటీ ద్వారా కొనుగోలు చేసిన వరిధాన్యం(వడ్లు) కమీషన్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ డిచ్‌పల్లి మండలం రాంపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభలో తీర్మానించారు. మంగళవారం సొసైటీ చైర్మన్ తారాచంద్ అధ్యక్షతన సొసైటీ మహాజన నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో నాగరాజు, సిబ్బంది నాగేశ్, డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను అరికట్టాలి



డిచ్‌పల్లి: వానాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డిచ్‌పల్లి ఎంపీడీవో రాజ్‌వీర్ సూచించారు. మంగళవారం మండలంలోని ముల్లంగి(బి) గ్రామాన్ని పరిశీలించారు. పలువురు ఇళ్ల వద్ద నిల్వ ఉన్న నీటిని తొలగింపజేశారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. లబ్ధిదారులు నిర్మాణ పనులను వేగవంతం చేసేలా కృషి చేయాలని జీపీ కార్యదర్శి గంగాధర్‌కు సూచించారు. అధికారులు, సిబ్బంది ఉన్నారు.

సంక్షిప్తం

అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్ లీగల్: మోపాల్ మండలం బైరాపూర్‌లో గిరిజనులపై అనుచితంగా వ్యవహరించిన అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గిరిజన రైతులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఉదయ భాస్కర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. దాడి చేసిన అధికారులపై మోపాల్ పీఎస్‌లో ఫిర్యాదు చేసినా స్పందన కరువైందని జడ్జి దృష్టికి వారు తీసుకెళ్లారు. న్యాయవాది బాలరాజ్ నాయక్, బంజారా సేవా సంఘం నాయకులు పాల్గొన్నారు.

పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించాలి

నిజామాబాద్‌నాగారం: అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు సూదం లక్ష్మి అన్నారు. మంగళవారం నగరంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల వారోత్సవాల గోడప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి రసూల్ బీ, డీఎంహెచ్‌వో రాజశ్రీ, ఆయూష్ ఇన్‌చార్జి గంగాధర్, సీడీపీవో సౌందర్య, వైద్యులు హరికృష్ణ, అధికారులు లక్ష్మి, మహాలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంగ్లీష్ విభాగంలో నాగజ్యోతి కి డాక్టరేట్

తెయూ(డిచ్‌పల్లి): తెయూ ఆంగ్ల విభాగంలో పరిశోధక విద్యార్థిని గోగునేని నాగజ్యోతి మంగళవారం డాక్టరేట్ సాధించారు. తెయూ ఆంగ్ల విభాగాధిపతి రమణాచారి పర్యవేక్షణలో 'ఫ్యామిలీ మ్యారేజ్, సొసైటీ ఇన్ ద సెలెక్ట్ నావెల్స్ ఆఫ్ మంజుకపూర్' అనే అంశంపై నాగజ్యోతి పరిశోధన పూర్తి చేసి సిద్ధాంత గ్రంథం సమర్పించారు. ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ లావణ్య, అధ్యాపకులు సమత, మహమ్మద్ జమీల్ అహ్మద్, లక్ష్మణ చక్రవర్తి, కాంట్రాక్టు అధ్యాపకులు జ్యోత్స్న, స్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో హెల్ప్‌డెస్క్

తెయూ(డిచ్‌పల్లి): తెయూ ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. వర్సిటీలో నూతనంగా ప్రారంభించిన ఇంజినీరింగ్ కాలేజ్‌లో మూడో విడత కౌన్సిలింగ్ ద్వారా ప్రవేశాలు పొందిన విద్యార్థులకు హెల్ప్‌డెస్క్ ద్వారా సహాయం అందించారు. ఏబీవీపీ వర్సిటీ కార్యదర్శి సమీర్ మాట్లాడుతూ.. తెయూలో ఇంజినీరింగ్ విద్యను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ర్యాగింగ్‌కు యువత దూరంగా ఉండాలి

నిజామాబాద్ రూరల్: యువత ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరిఫ్ అన్నారు. మల్లారం మేఘన డెంటల్ సైన్స్ కళాశాలలో విద్యార్థులకు యాంటీర్యాగింగ్‌పై ప్రత్యేక అవగాహన కల్పించారు. అనంతరం షీటీమ్ లోగోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్య, వైద్యంపై నిర్లక్ష్యం తగదు

నిజామాబాద్‌నాగారం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, వైద్యంపై నిర్లక్ష్యం చేస్తూ కార్పొరేట్ వ్యాపారులకు ప్రాధాన్యత ఇస్తున్నాయని విద్య, వైద్య పరిరక్షణ కమిటీ జిల్లా ప్రతినిధి డాక్టర్ రవీంద్రద్రనాథ్ సూరి పేర్కొన్నారు. విద్య, వైద్యంలో రిఫరల్ వ్యవస్థపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల ఉనికిని కాపాడుతాం

నిజామాబాద్ నాగారం: ఉత్తమ విద్యను అందించే చిన్న చిన్న ప్రైవేటు పాఠశాలల ఉనికిని కాపాడుతామని బడ్జెట్ స్కూల్ మేనేజ్‌మెంట్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపతి శేఖర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ జగ్గు మల్లారెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. త్వరలో జిల్లా కమిటీని ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రెజరర్ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, రహమద్ షఫీ, దయాకర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జలంధర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, కోశాధికారి శ్రీనివాస్ రావు, నిజామాబాద్ జిల్లా కోఆర్డినేటర్ నందురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాంధీగంజ్‌ను పరిశీలించిన ఏఎంసీ చైర్మన్



సుభాష్‌నగర్: నగరంలోని గాంధీగంజ్‌లో ఆక్రమణలను టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులతో కలిసి నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి మంగళవారం పరిశీలించారు. ఇటీవల గాంధీగంజ్‌లో కలెక్టర్ పర్యటించిన సమయంలో ఆక్రమణలు, తదితర అంశాలను చైర్మన్ ఆయన దృష్టికి తీసుకెళ్లిన విషయంతెలిసిందే. చైర్మన్ విజ్ఞప్తి మేరకు కలెక్టర్ ఆదేశానుసారం మున్సిపల్, రెవెన్యూ అధికారులు గాంధీగంజ్‌ను పరిశీలించారు. గాంధీగంజ్ మ్యాప్‌ను అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా మ్యాప్ ప్రకారం కొలతలు చేసి హద్దులు గుర్తించారు. అనంతరం చైర్మన్ ముప్ప గంగారెడ్డి మాట్లాడుతూ గాంధీగంజ్ రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో ఉందని, కొంతమేర ఆక్రమణలకు గురైందని తెలిపారు. ఈ నెల 15 తర్వాత తదుపరి కార్యచరణతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఆయన వెంట టౌన్ ప్లానింగ్ ఏసీపీ టి శ్రీనివాస్, టీపీవో ప్రదీప్‌కుమార్, నిజామాబాద్ నార్త్, సౌత్ తహసీల్దార్లు, గ్రేడ్–3 సెక్రెటరీ, సర్వేయర్లు, టీపీబీవోలు ఉన్నారు.

డిచ్‌పల్లిలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించండి

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి రైల్వే స్టేషన్ వద్ద ప్రజల సౌకర్యార్థం ఫుట్ ఓవర్ బ్రిడ్జి, రైల్వే గేటు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ ఘన్‌పూర్ గ్రామ పెద్దలు, బీజేపీ మండల నాయకులు మంగళవారం ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేకపోవడంతో వివిధ అవసరాల నిమిత్తం ప్రభుత్వ కార్యాయాలకు వెళ్లే ప్రజలు, చదువుల కోసం కళాశాలలకు వెళ్లే విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అలాగే గూడ్స్ రైళ్లు నిలిపి ఉంచడంతో వాటి కింద దాటుతూ పలువురు ప్రమాదాలకు గురయ్యారని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామస్తుల వినతిపై ఎంపీ సానుకూలంగా స్పందించారు. రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి డిచ్‌పల్లిలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు కర్ని చంద్రకాంత్, బీజేవైఎం మండల అధ్యక్షుడు రమణ, వీడీసీ సభ్యులు సాయిలు, గడ్డం గంగాదర్, కపిల్, మురళి, సురేశ్, మహేందర్, తిరుపతి, తిర్మల్, శ్రీను, సాయిరెడ్డి, సుదర్శన్, రాములు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ అర్వింద్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు నాయకులు

భక్తిశ్రద్ధలతో సంకష్టహర చతుర్థి

నిజామాబాద్ రూరల్: నగరంలో సంకష్టహర చతుర్థి(అంగారక చతుర్థి) పూజలను భక్తులు వినాయక ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం విఘ్నేశ్వరునికి చాలా విశిష్టతమైన రోజు కావడంతో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు పూజా కార్యక్రమాలు చేపట్టారు. సార్వజనిక్ గణేశ్ మండలి గణపతి ఆలయం, మహాగణపతి దేవాలయం(బొడ్డెమ్మ చెరువు), సిద్ధి వినాయక స్వామి దేవాలయం(గాయత్రినగర్), శుభం కరోతి గణపతి ఆలయం(మున్సిపల్), లక్ష్మీ గణపతి మహా ఆలయం(బోర్గం)లో గణనాథునికి భక్తులు పంచామృతాభిషేకం, గరికపూజ, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ చైర్మన్లు సీహెచ్ భూషణ్‌చారి, మచ్చ చంటయ్య, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



మహాగణపతి ఆలయం పూజలో పాల్గొన్న భక్తులు

తెయూ పరిరక్షణకు ఉద్యమిస్తాం

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, తెలంగాణ యూనివర్సిటీ పరిరక్షణకు ఉద్యమిస్తామని తెయూ ఏఐఎస్ఎఫ్ ఇన్‌చార్జి సంజీవ్, కన్వీనర్ చందు పేర్కొన్నారు. మంగళవారం వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ఎదుట జెండా ఆవిష్కరించి ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో విద్యార్థులను, యువతను ఏకం చేసి బ్రిటిష్ వారిని తరిమిన చరిత్ర ఏఐఎస్ఎఫ్ కు ఉందన్నారు. తెయూలో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ వర్సిటీ కో కన్వీనర్ సాయి, నాయకులు ప్రభాస్, అజయ్, నవీన్, భీమేశ్, అబ్దుల్, గణేశ్, పీర్‌సింగ్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

దేశ సంపదను పెట్టుబడిదారులకు దోచిపెట్టొద్దు

నిజామాబాద్ సిటీ: ప్రధాని నరేంద్ర మోదీ దేశ సంపదను పెట్టుబడిదారులకు దోచిపెడుతున్నారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్ మండిపడ్డారు. మంగళవారం నాందేవాడలో ఉన్న పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా 1942లో నిర్వహించిన క్విట్ ఇండియా స్ఫూర్తితో ప్రస్తుత కేంద్రం అనుసరిస్తున్న కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా క్విట్ కార్పొరేట్‌ను బుధవారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయరంగాన్ని కార్పొరేటీకరణ చేసే ప్రయత్నాన్ని తిప్పికొట్టాలన్నారు. క్విట్ కార్పొరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు యాదేశ్, నన్నేసాబ్, రాములు, నూర్జహాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేయాలి

నిజామాబాద్ సిటీ: అంగన్‌వాడీ టీచర్లకు ఆన్‌లైన్‌లో రిపోర్టులు ఇవ్వాలన్న నిబంధనలతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, వాటిని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ అధ్యక్షుడు రమేశ్‌బాబు కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆన్‌లైన్ ఎంట్రీ చేసే సమయంలో సెల్‌ఫోన్లు సహకరించటం లేదని, ఫొటో క్యాప్చర్‌కు సిగ్నల్స్‌రాక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రిటైర్ అయిన అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 18న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. నాయకులు పి.స్వర్ణ, చంద్రకళ, మంగాదేవి, జ్యోతి, యమునా, జగదాంబ, వాణి, సందీప పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



నిజామాబాద్‌అర్బన్: ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని నగరంలోని కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రఘురాం జెండాను ఆవిష్కరణ చేశారు. దేశం కోసం పోరాటం చేసిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని ఆయన అన్నారు. 90 ఏళ్ల పాటు విద్యారంగ సమస్యలపై నిరంతరం అధ్యయనం చేస్తూ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి కుశాల్, జిల్లా నాయకుడు సుబోద్, నాయకులు సంతోష్, కరణ్, కాళీ కుమార్, శ్రీ కాంత్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్: నగరంలోని పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–1 ఏడీఈ(ఆపరేషన్) ఆర్ చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని పద్మానగర్, కోటగల్లిలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చేందుకు బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అన్నారు. పద్మానగర్ రోడ్‌నంబర్ 1, కోటగల్లి, సిర్నాపల్లి గడి, జెండా బాలాజీ టెంపుల్, నకాశ్ గల్లి, పెద్దబజార్, మార్కండేయ టెంపుల్‌లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే దుర్గామాతా టెంపుల్, భారత్ గ్యాస్ ఏరియా, శ్రీ లక్ష్మి ఆర్కేడ్ అండ్ ఏఎన్నార్ అపార్ట్‌మెంట్‌కు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని చంద్రశేఖర్ కోరారు.